క్లుప్తంగా

ఇటి వద్దకే కల్యాణ తలంబ్రాలు

ఏటూరునాగారం: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి కల్యాణానికి సంబంధించిన తలంబ్రాలను పోస్టాఫీసు ద్వారా ఇంటి వద్దకే అందించడానికి శాఖ సన్నాహాలు చేపట్టిందని ములుగు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రామ్మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంత్రలయ అర్చన తలంబ్రాలు రూ.450లు, తలంబ్రాలు రూ. 150లు చెల్లించి పొందాలన్నారు.

దరఖాస్తు గడువు పెంపు

ములుగు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల దరఖాస్తు గడువు ఈ నెల 20 వరకు పొడిగించిందని జాకారం సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జాలూరి యాదగిరి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన ఎస్సీ, ఎస్టీ , బీసీ విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. నాల్గవ తరగతి పూర్తి అయిన విద్యార్థులు అర్హులని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఆదాయం రూ. 1లక్ష 50 వేలు, పట్టణ ప్రాంతాల వారికి రూ. 2లక్షలు ఆదాయం కలిగి ఉండాలని అన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23వ తేదీన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నిర్మాణ పనుల అడ్డగింత



భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి పట్టణంలోని సుభాస్‌కాలనీలో పోచమ్మగుడి, భారత్ గ్యాస్ గోడౌన్ పక్కన మజీద్ నిర్మాణ పనులను చేపట్టగా కాలనీవాసులు శనివారం అడ్డుకున్నారు. పోచమ్మ దేవాలయం పక్కన మజీద్ నిర్మించడం సరికాదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇరువర్గాలతో మాట్లాడి పనులు నిలిపివేశారు. మజీద్‌కు వేరే వద్ద స్థలం చూపించాలని కాలనీవాసులు కోరారు.

రేపు ఆధార్ అప్‌డేట్ కేంద్రం ఏర్పాటు

కాటారం: మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 20న ఆధార్ అప్డేట్ కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎంపీడీఓ శంకర్‌నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2016 కంటే ముందు ఆధార్ తీసుకున్న వారు తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. అప్‌డేట్ చేసుకునే వారు బ్యాంక్ పాస్‌పుస్తకం కానీ ఓటర్ ఐడీ కార్డు కానీ వెంట తీసుకొని గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లాలని తెలిపారు. మేడిపల్లి, అంకుషాపూర్, కొత్తపల్లి గ్రామపంచాయతీలకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆధార్ అప్‌డేట్ కోసం రూ.50 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



శాయంపేట : ఈనెల 25న కాకతీయ యూనివర్శిటీలో తలపెట్టిన విద్యార్థి ఉద్యమకారుల సంఘర్షణ సభ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో కేయూ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకుడు మంద నరేష్ మాట్లాడారు. స్వరాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు న్యాయం జరకపోగా ప్రభుత్వం నుంచి గుర్తింపు కూడా లభించడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. సంఘర్షణ సభను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు నాగుల పవన్, రాకేష్, కృష్ణ పాల్గొన్నారు.

బ్రహ్మీ గ్రాన్యూల్‌తో జ్ఞాపకశక్తి పెంపు



శాయంపేట : బ్రహ్మీ గ్రాన్యూల్ వాడితే విద్యార్థులకు జ్ఞాపిక శక్తి పెరుగుతుందని ఆయుర్వేద వైద్యాధికారి మంజుల తెలిపారు. మండలంలోని పెద్దకోడెపాక గ్రామ శివారులోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణపై డాక్టర్ మంజుల అవగాహన కల్పించారు. అనారోగ్యం బారిన పడకుండా, జ్ఞాపక శక్తి పెంచుకునేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పదో తరగతి విద్యార్థులకు బ్రహ్మీ గ్రాన్యూల్స్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ధన్యకుమారి, ఉపాధ్యాయులు మంజుల, చైతన్య, శైలజ, ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వాజేడు: ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని వాజేడు వైద్యాధికారి కొమరం మహేందర్ అన్నారు. మండల పరిధిలోని అరుగుంట పల్లి, కొంగాల గ్రామాల్లో శనివారం ఎంపీపీ శ్యామల శారద ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరాలు, దగ్గు, జలుబు ఉన్న వారిని గుర్తించి మందులను అందించారు. బాలింతలను, గర్భిణులను పరీక్షించి మందులను అందజేశారు. గ్రామస్తులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య పర్య వేక్షకుడు కోటిరెడ్డి, శేఖర్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పంట రుణాలు ఏకకాలంలో మాఫీ చేస్తాం..

కొత్తగూడ: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏకకాలంలో రెండు లక్షల పంట రుణాలు ఏకకాలంలో మంజూరు చేస్తామని ములుగు ఎమ్మెల్యే సీతక్క హామీ ఇచ్చారు. కొత్తగూడ, కొత్తపల్లి, గాంధీనగర్, మైలారం గ్రామాల్లో నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పంట రుణాలు మాఫీ చేస్తామని, డబుల్ బెడ్రూం ఇళ్లు, ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పి ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇల్లు లేని ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవడానికి రూ.అయిదు లక్షలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బానోత్ విజయరూప్‌సింగ్, జెడ్పీటీసీ పుష్పలత, సర్పంచ్ మల్లెల రణధీర్, నాయకులు నారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఈర్య, కమళ, శంకర్, వేణు, మొగిళి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సీతక్క

11మంది గైర్హాజరు



పరీక్ష కేంద్రం తనిఖీ చేస్తున్న డీఐఈఓ

వాజేడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ రెండవ సంవత్సరం పరీక్షలకు శనివారం 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జెనరల్ ఇంగ్లీష్ పరీక్షల్లో 112 మందికి గాను 109 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని డీఐఈఓ పీ వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు.

మాదిగలను విస్మరించిన ప్రభుత్వం



సంగ్రామ పాదయాత్రలో నాయకులు

ములుగు: కేంద్ర ప్రభుత్వం మాదిగలను విస్మరించిదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్‌మాదిగ అన్నారు. పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలను డిమాండ్‌తో ఛత్తీస్‌గఢ్ నుంచి చేపడుతున్న మాదిగల సంగ్రామ పాదయాత్ర శుక్రవారం రాత్రి ములుగు జిల్లాకేంద్రానికి చేరుకుంది. మాదిగ సోషలిస్ట్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ ఇరుగుపైడి మాదిగ, నెమలి నర్సయ్య, జన్ను రవి, మడిపల్లి శ్యాం, నద్దునూరి రమేష్ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. ప్రజలను నమ్మించి మోసం చేయడంలో బీజేపీకి నోబెల్ బహుమతి ఇవ్వవచ్చని అన్నారు. తొమ్మిది సంవత్సరాల పాలనలో మాదిగలకు ఇచ్చిన హామీని ఏ రోజూ పట్టించుకున్న పాపానపోలేదని అన్నారు. బీజేపీపై చేయనున్న యుద్ధంలో భాగంగా వచ్చే నెల 04వ తేదీన ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ చింతనిప్పుల భిక్షపతిగౌడ్, సాంబయ్య, ఓరుగంటి అనిల్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రానికి చెందిన భూపతి సాంబమూర్తి ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ఆర్యవైశ్య మహాసభ సభ్యులు శనివారం పరామర్శించారు. జిల్లా ఆర్య వైశ్య మహాసభ సహకారంతో సంఘం మండల అధ్యక్షులు పాలడుగు చంద్రశేఖర్ 42 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు సిద్ధంశెట్టి శ్రీనివాస రావు, ఉపాధ్యక్షులు సిద్ధంశెట్టి లక్ష్మణ్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిద్ధంశెట్టి వైకుంఠం, కార్యదర్శి అనుగం రవి, ప్రధాన కార్యదర్శి బచ్చు సుబ్బారావు, కోశాధికారి యలమర్తి విశ్వనాథం, కార్యదర్శులు ఎల్లంకి రమేష్, సురేష్, మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

వెంకటాపురం(కె): తుపాన్ వల్ల నష్టపోతున్న రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని హైకోర్టు, సుప్రీంకోర్టు అడ్వకేట్ పిట్టా శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మిర్చి, వరి, మొక్కజొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. ఈ గులాబ్ తుపాన్ ప్రభావం వల్ల వేలాది మంది రైతులు కోట్లాది రూపాయల పంటలు నష్టపోయాయన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



ఎస్ఎస్‌తాడ్వాయి: పరామర్శిస్తున్న సీతక్క



శాయంపేట: పరామర్శిస్తున్న గండ్ర జ్యోతి

ఎస్ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రంలోని ఇందిరానగర్ గ్రామానికి చెందిన మాజీ పీఏసీఎస్ చైర్మన్ పాక సాంబయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క శనివారం పరామర్శించారు. ఆరోగ్యంపై జాగ్రతలు తీసుకోవాలని చెప్పారు. సీతక్క వెంట జిల్లా సీనియర్ నాయకుడు బొల్లు దేవేందర్, సర్పంచ్ ఇర్ప సునీల్, జిల్లా నాయకులు అరెం లచ్చుపటేల్, ఎండీ ముజఫర్‌హుస్సెన్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, అనుమాండ్ల రాజిరెడ్డి, నాగారాజు ఉన్నారు.

శాయంపేట : మండలానికి చెందిన ఆర్ఎంపీ ప్రభాకర్ సతీమణి సంధ్యారాణి మృతి చెందగా బాధిత కుటుంబాన్ని వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, టీపీసీసీ సభ్యుడు గండ్ర సత్యనారాయణరావు శనివారం వేర్వేరుగా పరామర్శించారు. తొలుత వారు సంధ్యారాణి చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించారు. అనంతరం ప్రభాకర్‌ను పరామర్శించి ప్రమాదం జరిగిన తీరుపై అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, సర్పంచ్ కందగట్ల రవి, ఉప సర్పంచ్ దైనంపల్లి సుమన్, పీఏసీఎస్ చైర్మన్ కుసుమ శరత్, వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతిరెడ్డి, మాజీ చైర్మన్ రాజిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి ఉన్నారు.

విద్యుత్ నిలిపివేత.. సబ్‌స్టేషన్ ముట్టడి

శాయంపేట : మండల కేంద్రంలోని దళిత కాలనీలోని ఇళ్లకు విద్యుత్ మీటర్లు బిగించుకోవాలని సూచిస్తూ ఆ కాలనీలో విద్యుత్ అధికారులు శనివారం ఉదయం విద్యుత్ సరఫరా నిలిపేశారు. రాత్రి అయినా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించకపోవడంతో దళిత కాలనీవాసులు శనివారం రాత్రి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించి నిరసన తెలిపారు. ఏఈ రాజ్‌కుమార్‌తో వాగ్వివాదానికి దిగారు. ఈ సందర్భంగా ఏఈ రాజ్‌కుమార్ మాట్లాడుతూ విద్యుత్ మీటర్లు బిగించుకుంటే నెలకు 100 యూనిట్ల వరకు ఉచితంగా ప్రభుత్వం విద్యుత్ సరఫరా చేస్తుందని మూడ్రోజులుగా అవగాహన కల్పిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. పోలీసులు సబ్‌స్టేషన్‌కు చేరుకొని కాలనీవాసులతో, విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడారు. ఉన్నతాధికారులను పిలిపించి దళిత కాలనీవాసులతో మాట్లాడించాలని, తాత్కాలికంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని ఏఈ రాజ్‌కుమార్‌కు పోలీసులు సూచించారు. అనంతరం అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో ఆందోళనకారులు వెళ్లిపోయారు.



ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

ఆగి ఉన్న ఆటోను ఢీ కొట్టిన లారీ

వాజేడు: ఆగి ఉన్న ఆటోను లారీ ఢీకొట్టిన ఘటన మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైవేపై లోడుతో వేగంగా వస్తున్న లారీ మండల పరిధిలోని జగన్నాథపురం వద్దకు రాగానే వాజేడు వైపునకు వెళ్లే రహదారి పక్కన ఉన్న అంజనేయస్వామి గుడికి సంబంధించిన షెడ్డును ఢీకొట్టుకుంటూ గుడి వెనుక వైపున ఆగి ఉన్న ఆటోను బలంగా ఢీకొట్టింది. ఆటో పల్టీలు కొడుతూ కిందకు పడిపోయింది. ఆటోలో ఎవరు లేక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. లారీ ముందుకు వెళ్లి చెట్టుకు తగిలి ఆగింది.



పల్టీ కొట్టిన ఆటో

భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలో పెరక (పుర గిరిక్షత్రియ) సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ.. పెరక సంఘం ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి శనివారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చెంచు ఆంజనేయులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సంఘం నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు అల్లం చంద్రయ్య, గౌరవ అధ్యక్షుడు మోటపలుకుల రమేష్, ప్రధాన కార్యదర్శి గోల రాజు, నాయకులు శ్రీనివాస్, కృష్ణ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సంఘం నాయకులు

రైతు సదస్సులో బూడిదపల్లి రైతు

కాటారం: సీయస్ఐఆర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన జీ20 రైతు అవగాహన సదస్సులో కాటారం మండలం బూడిదపల్లికి చెందిన రైతు పోటు తిరుపతిరెడ్డి పాల్గొన్నారు. తిరుపతిరెడ్డి గ్రామంలో ఆయిల్‌పామ్‌తో పాటు సుగంధ మొక్కల సాగు చేస్తున్నారు. నిర్వాహకుల ఆహ్వానం మేరకు సదస్సులో పాల్గొని పంట సాగులో తీసుకోవాల్సిన మెలుకువలపై నిపుణులు ఇచ్చిన సలహాలు, సూచనలను తెలుసుకున్నారు. అనంతరం వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిని కలిసి రైతులు సాగు చేస్తున్న ఎర్రచందనం, అయిల్‌పామ్, సుగంధ దుంగల విక్రయంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గూర్చి మంత్రికి వివరించినట్లు తిరుపతిరెడ్డి తెలిపారు. దీంతో స్పందించిన మంత్రి కొనుగోలుదారులను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తిరుపతిరెడ్డి పేర్కొన్నారు.



మంత్రి నిరంజన్‌రెడ్డితో మాట్లాడుతున్న రైతు తిరుపతిరెడ్డి

నర్సరీల నిర్వహణ సక్రమంగా చేపట్టాలి

కాటారం: గ్రామ పంచాయతీల్లో నర్సరీల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ సూచించారు. మండలంలోని చిద్నెపల్లి, ప్రతాపగిరి గ్రామాల్లోని నర్సరీలను శనివారం ఎంపీడీఓ పరిశీలించారు. మొక్కల పెంపకం, నిర్వహణ తీరుపై ఆరా తీశారు. నర్సరీల్లో మొలకెత్తని బ్యాగుల్లో లోకల్ సీడ్ విత్తనాలు కానీ పూల మొక్కలకు సంబంధించిన కొమ్మలు నాటాలని సూచించారు. ఎండలకు మొక్కలు చనిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎంపీడీఓ వెంట ఏపీఓ వెంకన్న, సర్పంచ్ రాజమౌళి, పంచాయతీ కార్యదర్శులు దేవేందర్, మల్లికార్జున్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

అభివృద్ధికి ఆకర్షితులై చేరికలు

నర్సంపేట :బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ఎంతో మంది పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నెక్కొండ మండలం బొల్లికొండ గ్రామపార్టీ అధ్యక్షుడు రాంచంద్రు, ఉపాధ్యక్షుడు రాంకోటి, మాజీ సర్పంచ్ మాలోత్ యాకు, మాజీ ఎంపీటీసీ సుగ్రీవ్, డైరెక్టర్ జి.రమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బానోత్ వెంకన్న, కాసోజు యాకంబరాచారి, బీఓ అధ్యక్షురాలు శ్రీలత, మహిళలతో పాటు మరో 30కుటుంబాలు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బొల్లికొండ గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉంటామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్

అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమత లేని ఎంతో మంది పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంలా మారిందని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నల్లబెల్లి మండలం బుచ్చిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వాంకుడోత్ స్వాతి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా శనివారం రూ.1.50లక్షల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, వార్డు మెంబర్, పార్టీ ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ఎట్టకేలకు నిర్మాణం పూర్తి

- నడుస్తూ.. నిలుస్తూ సాగిన తహసీల్దార్ కార్యాలయ నిర్మాణం
- ఆరు సంవత్సరాలకు పూర్తి

మల్హర్: మండల కేంద్రమైన తాడిచర్లలో ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న తహసీల్దార్ నూతన భవనం పనులు నడుస్తూ.. నిలుస్తూ.. ఎట్టకేలకు పనులు పూర్తయ్యాయి. 2017 సంవత్సరం ఆగస్టులో రూ.40లక్షల వ్యయంతో నూతన తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి అధికారులు శ్రీకారం చుట్టారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌లకు అధికారులు బిల్లు చెల్లింపులు ఆలస్యం చేస్తుడంతోనే పనులు నత్త నడకన సాగాయి. మొదటి సారి పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను వేగంగా స్లాబ్ వరకు చేసిన నిధులలేమితో నిలిచి పోయింది. అనంతరం రూ.35లక్షల వ్యవయంతో మరో కాంట్రాక్టర్‌కు నిర్మాణ పనులను అప్పగించారు. సదరు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకుచ్చారు.

శిథిలావస్థకు చేరుకున్న ప్రస్తుత కార్యాలయం

ప్రస్తుతం కొనసాగిస్తున్న తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థ భవనంలో కొనసాగుతుంది. 1993 సంవత్సరంలో తహసీల్దార్, మండలపరిషత్ కార్యాలయాన్ని నక్సల్స్ పేల్చివేయడంతో భద్రత కారణాల దష్ట్యా కార్యాలయాలను మంథనికి తరలించారు. దశాబ్దాకాలంగా మంథనిలో కొనసాగిన కార్యాలయాలను తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మండలకేంద్రంలో కొనసాగించాలనే ఉద్దేశ్యంతో 2014 ఆగస్టులో తాడిచర్లలోని పాత భవనంలోకి తరలించారు. ప్రస్తుతం కొనసాగుతున్న కార్యాలయం పూర్తిగా శిథిలావాస్థకు చేరింది. చిన్ని పాటి వర్షం కురిసిన కార్యాలయంలో రికార్డు తడిసి పోయో ప్రమాదం ఉంది. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి భవనం త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.



నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం

భవనం అప్పగించ లేదు



ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం పనులు పూర్తయ్యాయి. సదరు కాంట్రాక్టర్ మాత్రం ఇప్పటి వరకు నూతన భవనం మాకు అప్పగించ లేదు. భవనం హ్యాండ్ ఓవర్ చేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రారంభానికి చర్యలు తీసుకుంటాం.

\- శ్రీనివాస్, తహసీల్దార్, మల్హర్

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ములుగు రూరల్: అప్పుల బాధతో రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని అబ్బాపూర్‌లో శనివారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అబ్బాపూర్ గ్రామానికి చెందిన పల్లెబోయిన రవి (50) తన వ్యవసాయ భూమితో పాటు రెండు ఎకరాలు భూమి కౌలుకు తీసుకొని మిర్చి పంట సాగు చేస్తున్నాడు. గత సంవత్సరం సాగు చేసిన పంట సరైన దిగుబడి రాక అప్పులు మిగిలాయి. అయినప్పటికీ ఈ ఏడాది తిరిగి మళ్లి రెండు ఎకరాల భూమిలో మిర్చి సాగు చేయగా పంటకు తెగులు సోకడంతో పూర్తిగా పాడయింది. దీంతో మనస్తాపంతో పంటకు తెచ్చిన పెట్టుబడి రూ. 2లక్షల అప్పు ఎలా తీర్చాలనే మనోవేదనతో వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఇంటికి తిరిగి వచ్చి ఒక్కసారిగా కిందపడిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్న క్రమంలో మృతి చెందాడు. మృతుడి భార్య వసంత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఓంకార్‌యాదవ్ తెలిపారు.